సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 30 । జూన్ । 2024



మీ సేవలు అభినందనీయం

పోలీసు శాఖలో దశాబ్దాల పాటు సేవలందించడం అభినందనీయమని 'పశ్చిమ', ఏలూరు జిల్లా ఎస్పీలు అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని సత్కరించారు. 8లో ▸



ఆహా ఏమి రుచి..

భీమవరం సమీపంలోని పెన్నాడ పరిసర గ్రామాల్లో పండించే వంకాయ పెన్నాడ వంకాయగా ప్రసిద్ధి చెందింది. తెలుపు, నలుపు రంగుల్లో ఈ వంకాయలు ఉంటాయి. 8లో ▸



ఆడిట్ పేరుతో వసూళ్లు

నూజివీడులో మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల నుంచి ఆడిట్ పేరుతో అదనంగా సొమ్ములు వసూలు చేయడంపై మహిళలు ఫిర్యాదు చేశారు. 8లో ▸

ఉజ్వల భవితకు ఇంజినీరింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉజ్వల భవితకు వారధిగా ఇంజినీరింగ్ కోర్సులు నిలుస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా సాంకేతిక రంగంలో నెలకొన్న విప్లవాత్మక మార్పులతో ఇంజినీరింగ్ చదువుపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. కార్పొరేట్ సంస్థల్లో కొలువులు, లక్షల్లో ప్యాకేజీలు, విస్తృత అవకాశాలు ఉండటంతో ఇంజినీరింగ్‌కు ఏటేటా క్రేజ్ పెరుగుతోంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రూపొందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా పేద కుటుంబాల విద్యార్థులకు ఇంజినీరింగ్ కోర్సులు ఉచితంగా అందుబాటులోకి రావడంతో ఇంజినీరింగ్ విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

కలల కోర్సులు

ఇంజినీరింగ్ విద్య లక్షలాది మంది విద్యార్థుల కల. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇంజినీరింగ్ కోర్సులకు ఉన్న క్రేజ్ చాలా ఎక్కువనే చెప్పాలి. విద్యార్థులు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, ఏపీ ఈఏపీసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షల ద్వారా ఇంజినీరింగ్ కోర్సుల్లోకి ప్రవేశిస్తున్నారు. ఈ ఏడాది ఆయా ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదల కావడంతో ఇప్పుడు విద్యార్థులకు కోర్సుల ఎంపిక కీలకంగా మారింది. ఏ కోర్సు చేస్తే తమ భవిష్యత్ బాగుంటుంది, ఏ బ్రాంచీ తీసుకోవాలనే వివరాలు విద్యార్థులు సేకరిస్తున్నారు. ముఖ్యంగా సీఎస్ఈ, ఈసీఈ, ట్రిపుల్ ఈ, సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

సీఎస్ఈకు యమ డిమాండ్

ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్)కు విద్యార్థులు తొలి ప్రాధాన్యమిస్తారు. ఐటీ కొలువులు, ఆకర్షణీయ ప్యాకేజీలు ఉండటమే ఇందుకు కారణం. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, నెట్ వర్కింగ్, అల్గారిథమ్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్, ప్రోగ్రామ్ డిజైన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా బేస్, డేటా స్ట్రక్చర్స్ తదితర అంశాలను బోధిస్తారు.

రెండో ప్రాధాన్యం ఈసీఈ

విద్యార్థులకు రెండో ప్రాధాన్యంగా ఈసీఈ బ్రాంచ్ నిలుస్తుంది. ఎలక్ట్రికల్ పరికరాలు, అనలాగ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్, శాటిలైట్ కమ్యూనికేషన్స్, మైక్రోవేవ్ ఇంజినీరింగ్, మైక్రో ప్రాసెసర్స్, మైక్రో కంట్రోలర్స్, ట్రాన్స్‌మీటర్, రిసీవర్, ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ పరికరాల తయారీ, యాంటెన్నా, కమ్యూనికేషన్స్ సిస్టమ్స్ తదితర అంశాలను బోధిస్తారు. కోర్ సెక్టార్‌తో పాటు సాఫ్ట్‌వేర్ రంగంలోనూ కొలువులు పొందవచ్చు.

2 లక్షల మంది ట్రిపుల్‌ఈ ఇంజినీర్లు అవసరం

ట్రిపుల్‌ఈ బ్రాంచ్ ద్వారా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో పట్టు సాధించవచ్చు. ఆయా రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రికల్ టెక్నాలజీ, మెషీన్స్, మోటార్లు, జనరేటర్లు, సర్క్యూట్ అనాలసిస్, పవర్ ఇంజినీరింగ్ తదితర అంశాలను ఈ కోర్సులో బోధిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో విద్యుత్ సంస్కరణలు, ప్రాజెక్టులు కారణంగా దేశంలో రానున్న నాలుగేళ్లలో రెండు లక్షల మంది ట్రిపుల్‌ఈ ఇంజినీర్లు అవసరమని అంచనా. .

'రియల్' దూకుడుతో 'సివిల్'కు డిమాండ్ : కోర్ బ్రాంచీలలో మరో ముఖ్యమైనది సివిల్ ఇంజినీరింగ్. బూమ్‌తో సంబంధం లేకుండా ఎప్పటికీ డిమాండ్ ఉండే బ్రాంచ్ ఇది. నిర్మాణ రంగంలో ఉద్యోగాలతో పాటు సొంతంగా కన్సల్టెన్సీలు ఏర్పాటుచేసుకుని ఉపాధి పొందవచ్చు. రియల్ ఎస్టేట్ రంగం దూకుడు మీద ఉండటంతో సివిల్ ఇంజినీరింగ్ అభ్యర్థులకు డిమాండ్ పెరుగుతోంది.

మరిన్ని కోర్సులపై..

మెకానికల్ ఇంజినీరింగ్‌కు ఎవర్ గ్రీన్ బ్రాంచ్‌గా గుర్తింపు ఉంది. యంత్రాలు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రికల్ మోటార్లు, భారీ వాహనాల రూపకల్పనకు మెకానికల్ ఇంజినీర్లు కీలకం కావడం ఇందుకు కారణం. అలాగే కెమిస్ట్రీ, ఫిజిక్స్, గణితం సమ్మిళితంగా ఉండే కెమికల్ ఇంజినీరింగ్‌కు సైతం మంచి భవిష్యత్ ఉంది. డీఎన్‌ఏ సీక్వెన్సింగ్, మానవ జీనోమ్ ప్రాజెక్టు, జెనెటిక్ ఇంజినీరింగ్ వంటివి కెమికల్ ఇంజినీరింగ్‌లో మార్పులకు తెరతీశాయి.

ప్రవేశాల సమయం..
ఆసక్తికి ప్రాధాన్యం

- కోర్సుల ఎంపిక కీలకం
- ఇంజినీరింగ్ బ్రాంచ్‌లపై విద్యార్థుల ఆరా
- ఉమ్మడి జిల్లాలో 12 కళాశాలలు
- గతేడాది 10,140 సీట్లు



ఏలూరులో సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల

12 కళాశాలలు.. 10,140 సీట్లు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, జంగారెడ్డిగూడెంలో 12 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. మొత్తంగా ఆయా బ్రాంచీలలో 10,140 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఏపీ ఈఏపీసెట్‌లో ర్యాంకుల ఆధారంగా కన్వీనర్ సీట్లు భర్తీ చేస్తారు. ఇలా సీటు రాని విద్యార్థులు డొనేషన్లు చెల్లించి యాజమాన్య కోటాలో సీటు పొందవచ్చు.

సబ్జెక్టుపై పట్టుతో రాణింపు



ఇంజినీరింగ్ అంటేనే వైవిధ్యమైన విద్యావిధానం. అన్ని బ్రాంచ్‌లూ మంచివే. విద్యార్థుల సృజనాత్మకతకు సానపెట్టే కోర్సులు ఇంజినీరింగ్‌కే సొంతం. సాఫ్ట్‌వేర్ బూమ్ ఉండటంతో ఎక్కువ మంది సీఎస్ఈ వైపు మొగ్గు చూపుతున్నారు. ట్రిపుల్‌ఈ, ఈసీఈ, సివిల్ వంటి బ్రాంచ్‌లతో సైతం మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయి. విద్యార్థులు తాము ఏ బ్రాంచ్‌లో చదివినా ఆ సబ్జెక్టుపై పట్టుసాధిస్తే ఆయా రంగాల్లో రాణిస్తారు.

– డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్, సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ఏలూరు

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్ నాగరాణికి మొక్క అందిస్తున్న ఎస్పీ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.నాగరాణిని శనివారం జిల్లా ఎస్పీ అజిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు మొక్క అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణపై వీరిద్దరూ చర్చించారు.

వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో

కలెక్టర్ నాగరాణిని జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వీఆర్వోల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లగా ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధికి వీఆర్వోలు పూర్తిగా సహకరిస్తామని సంఘ నాయకులు తెలిపారు. సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ, గుమ్మల్ల జకరయ్య, కేవీవీ సత్యనారాయణ, వి.ముత్యాలరావు, ఆర్.రత్నరాజు, బి.బాబులు, చొప్పల భూషణం తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

1,530 కేసుల పరిష్కారం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 1,530 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. 154 సివిల్ కేసులు, 129 వాహన ప్రమాద బీమా కేసులు, 1,247 క్రిమినల్ కేసులు, 102 ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేశామన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి

పెనమలూరు: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన అందించాలని కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా సూచించారు. పెనమలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ఏలూరు జిల్లాల ఉపాధ్యాయులకు అటల్ టింకరింగ్ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో ఉపాధ్యాయులు సాంకేతికతపై అవగాహన కల్పించుకుని విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలని సూచించారు. బోధనలో సాంకేతికత అంశాలను జోడించి విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, డీఎస్‌ఓ జాకీర్ అహ్మద్, స్టేట్ హబ్ ఇన్‌చార్జి డీవీ సుబ్బారావు, హెచ్‌ఎం వై.దుర్గాభవాని పాల్గొన్నారు. అటల్ టింకరింగ్ శిక్షణ శనివారంతో ముగిసింది.

నేరాల నిరోధానికి చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లావ్యాప్తంగా రాత్రి వేళల్లో పోలీస్ గస్తీని మరింత పటిష్టం చేయటంతోపాటు రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు ఫేస్‌వాష్ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు ఫేస్‌వాష్ కార్యక్రమంతోపాటు రాత్రివేళ నేరాలను నిరోధించేందుకు పోలీస్ గస్తీని మరింత ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తూ నగదు, సారా, మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపట్టారన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఏటీఎం సెంటర్లు, ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద అప్రమత్తంగా ఉంటూ అనుమానిత వ్యక్తులను పరిశీలిస్తూ తనిఖీలు చేపడుతున్నారన్నారు. లాడ్జిలు, రైల్వే, బస్టాండ్ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులపై నిఘా పెట్టామన్నారు.

సచివాలయాల తనిఖీ

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం మల్కాపురం, నగరంలోని అమీనాపేట, శాంతినగర్ వార్డు సచివాలయాలను ఏలూరు కలెక్టర్ వెట్రి సెల్వి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. సోమవారం చేపట్టనున్న పింఛన్ల పంపిణీపై అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుల నుంచి డ్రా చేసిన సొమ్ములు భద్రంగా ఉంచాలని సూచించారు. లబ్ధిదారుల ఇంటికే వెళ్లి నేరుగా పింఛన్ అందించాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సొమ్ము అందజేసిన తర్వాత క్రమపద్ధతిలో రసీదు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, జిల్లా అధికారి ఆమె వెంట ఉన్నారు.

అభ్యర్థుల వ్యయ దస్త్రాల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నరసాపురం పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థుల తుది వ్యయ దస్త్రాలను వ్యయ పరిశీలకులు పియూష్ శుక్లా, మోహిల్ అగర్వాల్, విక్రమాదిత్య మీనా పరిశీలించారు. శనివారం కలెక్టరేట్‌లో అభ్యర్థుల తుది వ్యయ దస్త్రాలను వీరు స్వీకరించారు. అభ్యర్థుల ప్రచారంలో చేసిన ప్రచురణలు, ర్యాలీలు, కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, సభలు, సమావేశాలు, రోడ్ షోలు, వాహనాలు తదితర ప్రచార ఖర్చుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు పియూష్ శుక్లా మాట్లాడుతూ అభ్యర్థుల తుది వ్యయ దస్త్రాలను పూర్తిగా అధ్యయనం చేసి కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. ముందుగా కలెక్టర్ సి.నాగరాణిని వ్యయ పరిశీలకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాదు, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, వ్యయ పరిశీలకుల సహాయకులు, పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎన్నికల పరిశీలకులు పియూష్ శుక్లా, మోహిల్ అగర్వాల్, విక్రమాదిత్య మీనా

ప్రావీణ్యంతో ఉద్యోగికి గుర్తింపు

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్యోగిలో ప్రావీణ్యం ఉంటేనే గుర్తింపు లభిస్తుందని, సీనియర్ ఉద్యోగుల నుంచి ప్రతి విషయాన్ని అవగతం చేసుకోవాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టరేట్ మెజిస్టీరియల్ సూపరింటెండెంట్ టీపీ కృష్ణారావు పదవీ విరమణ సందర్భంగా జరిగిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి కృష్ణారావును ఆమె సత్కరించారు. కృష్ణారావు రెవెన్యూ శాఖలో 38 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేయడం అభినందనీయం అని అన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణ రెడ్డి, జిల్లా అభివృద్ధి అధికారి కేసీహెచ్ అప్పారావు, డీఎల్‌డీఓ ఏవీ అప్పారావు, జిల్లా కలెక్టరేట్ పరిపాలనా అధికారి పి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆమెకు దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వక స్వాగతం పలికారు. ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు ఆమెకు పట్టువస్త్రాలను, వేద ఆశీర్వచనాన్ని అందించగా ఆలయ డీఈఓ బాబురావు శ్రీవారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

మద్ది సన్నిధిలో..

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి ప్రతాప వెంకట జ్యోతిర్మయి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈఓ కొండలరావు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కాళహస్తి రాజరాజేశ్వరీ తేజస్వి ఉన్నారు.



చినవెంకన్న మెమెంటో అందిస్తున్న ఆలయ డీఈఓ

● అబ్బురం.. దశావతార కోలాటం



ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో దశావతారాల్లో నిర్వహించిన కోలాట ప్రదర్శన అబ్బురపరిచింది. పొద్దుటూరుకు చెందిన సావిత్రిబాయి పూలే కోలాట బృంద సభ్యులు 222 మంది మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, కల్కి, వేంకటేశ్వర స్వామి వేషధారణలతో కోలాట నృత్యాలు చేశారు. కోలాటం మాస్టర్ జె.సాయిభరత్, బండి మల్లికల ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. – ద్వారకాతిరుమల

సమన్వయంతో జిల్లా సమగ్రాభివృద్ధి



కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శనివారం భీమవరం కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, అగ్రికల్చర్, విద్య, ఆరోగ్య, సాంఘిక సంక్షేమం, పౌరసరఫరాల శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. జూలై 1న నూరు శాతం పెన్షన్ల పంపిణీ చేయాలని ఆమె ఆదేశించారు. ఎక్కడా చిన్నపాటి పొరపాట్లకు వీలు లేదన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం వెంటనే క్షేత్రస్థాయిలో బృందాలను ఏర్పాటు చేయాలని, సచివాలయ ఉద్యోగులతో పాటు ఆర్ఐలు, జూనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, బిల్ కలెక్టర్లు తదితర సిబ్బందిని నియమించాలన్నారు. ప్రతి 50 మంది లబ్ధిదారులకు ఒక ఉద్యోగిని ఏర్పాటు చేయాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల మంజూరును వేగవంతం చేయాలని ఆదేశించారు.

విద్యా పథకాల అమలులో..

పేద పిల్లలకు విద్యా పథకాల అమలులో విద్య, సాంఘిక సంక్షేమ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల అడ్మిషన్లు, అదనపు తరగతి గదులు, రైట్ టు ఎడ్యుకేషన్ తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రాధాన్యమిస్తూ మిగిలిన సీట్ల విషయంలో నిజంగా అవసరమైన వారికి సీట్లను కేటాయించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పాఠశాలల్లో మనబడి నాడు–నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలన్నారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు త్వరగా అందించాలన్నారు.

త్వరితగతిన నాట్లు పూర్తిచేయాలి

జిల్లాలో వరి విత్తనాల పంపిణీ, నారుమడులు, నాట్లుపై కలెక్టర్ ఆరా తీశారు. త్వరితగతిన నాట్లు పూర్తిచేసేలా రైతులను సన్నద్ధం చేయాలన్నారు. ఎరువుల విక్రయ దుకాణాలపై దృష్టి పెట్టాలన్నారు. మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖ, ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన శాఖలపై ఆమె సమీక్షించారు.

డయేరియా నియంత్రణకు..

జిల్లాలో డయేరియా వ్యాధి నియంత్రణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. డయేరియా ప్రబలకుండా కాచి చల్లార్చిన వేడి నీళ్లు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో మంచినీరు ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఆర్డీఓలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, ఇన్‌చార్జి డీఈఓ జి.నాగమణి, వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, డ్రెయినేజీ ఈఈ ఎంవీవీ కిషోర్, కెనాల్స్ ఈఈ ఎం.దక్షిణామూర్తి, డీఎస్ఓ ఎస్.సరోజ, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా మత్స్య శాఖ అధికారి ప్రసాద్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి పాల్గొన్నారు.

1 నుంచి 'స్టాప్ డయేరియా'

ఏలూరు(మెట్రో): జిల్లాలో డయేరియా నియంత్రణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్'పై సోషల్ మీడియా ద్వారా అవగాహనకు ఫేజ్‌బుక్ పేజీని ఆమె ప్రారంభించారు. ఈ క్యాంపెయిన్ ద్వారా జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గ్రామ, పట్టణాల్లో ట్యాంకులు శుభ్రం, క్లోరినేషన్ పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయేరియా మందులతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేశామన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు.

చెదురుమదురు వర్షపాతం

ఏలూరు(మెట్రో): జిల్లావ్యాప్తంగా చెదురుమదురు వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం వరకు 24 గంటల వ్యవధిలో 6.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చింతలపూడి మండలంలో 22.4 మి.మీ, అత్యల్పంగా నూజివీడులో 0.2 మి.మీ వర్షం కురిసింది. మండలాల వారీగా కుక్కునూరు 19.0, కామవరపుకోట 18.6, ద్వారకాతిరుమల 16.2, బుట్టాయగూడెం 13, టి.నరసాపురం 11.2, కొయ్యలగూడెం 9.8 మి.మీటర్ల వర్షం కురిసింది. జీలుగుమిల్లిలో 9.2, కైకలూరులో 8.6, వేలేరుపాడులో 5.6, జంగారెడ్డిగూడెం, లింగపాలెంలో 4.8, కలిదిండిలో 4.6, పెదవేగిలో 4.2, ఏలూరు అర్బన్‌లో 4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. చాట్రాయి, ఏలూరు రూరల్‌లో 3.6, పెదపాడులో 3.4, ఉంగుటూరు, మండవల్లిలో 3.2, ముదినేపల్లిలో 3.0, పోలవరంలో 2.8, దెందులూరులో 2.6, ముసునూరు, నిడమర్రులో 2.4, ఆగిరిపల్లిలో 1.8, భీమడోలులో 0.8 మి.మీటర్ల వర్షం కురిసింది.

5 బెంచ్‌లతో జాతీయ లోక్ అదాలత్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరంలోని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కేసుల పరిష్కారానికి ఐదు బెంచ్‌లను ఏర్పాటుచేశారు. 3వ అదనపు జిల్లా కోర్టు కేసుల పరిష్కారం నిమిత్తం ఏర్పాటుచేసిన బెంచ్‌కు పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎం.సోమశేఖర్, న్యాయవాది సభ్యుడిగా పాకా రమేష్‌బాబు, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం నిమిత్తం బెంచ్‌కు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) బి.అప్పలస్వామి, న్యాయవాది సభ్యునిగా బొమ్మదేవర త్రిమూర్తులు వ్యవహరించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టుల కేసులు పరిష్కారం నిమిత్తం బెంచ్‌కు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు, సభ్యునిగా సంఘ సేవకులు మేశం దుర్గాప్రసాద్, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు కేసుల పరిష్కారం నిమిత్తం బెంచ్‌కు న్యాయమూర్తిగా 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హనీషా, న్యాయవాద సభ్యురాలిగా ఎస్.సత్య విజ్ఞాన దేవి వ్యవహరించారు. 2వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టు కేసుల పరిష్కారం నిమిత్తం ఏర్పాటుచేసిన బెంచ్‌కు న్యాయమూర్తిగా 2వ అదనపు సివిల్ జడ్జి డి.ధనరాజు, న్యాయవాది సభ్యునిగా గుడాల సుధాకర్ వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగ్గల వెంకట రమణారావు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

197 కేసుల రాజీ

సివిల్ కేసులు 10, క్రిమినల్ కేసులు 159, ప్రీ లిటిగేషన్ కేసులు 28 మొత్తం 197 కేసులు రాజీ చేశారు. కేసుల మొత్తం విలువ సుమారు రూ.1.80 కోట్లు. కాగా పలువురికి రికవరీ సొమ్ములు అందించారు.

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో
బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో జూలై 5 నుంచి జూలై 31వ తేదీ వరకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారు.

శిక్షణలో నేర్పించే అంశాలు

1) థ్రెడ్డింగ్, 2) వ్యాక్స్ 3) పెడిక్యూర్ 4) మెనిక్యూర్ 5) బ్లీచింగ్ 6) స్కిన్ కేర్ 7) హెయిర్ కేర్ 8) వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్ 9) డ్యాండ్రఫ్ ట్రీట్మెంట్ 10) హెయిర్ ఫాల్ ట్రీట్మెంట్ 11) హెయిర్ కట్స్ 12) హెయిర్ స్టైల్స్ 13) హెన్నా ప్రిపరేషన్ 14) డై అప్లికేషన్ 15) బ్రైడల్ మేకప్స్ 16) ఒబెసిటీ అండ్ న్యూట్రీషియన్ డైట్ 17) హెయిర్ మసాజ్ 18) కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్ 19) ఫేషియల్స్ 20) యాంటీ ఏజింగ్ అండ్ థర్మో హెర్బ్ ఫేషియల్స్

- రిజిస్ట్రేషన్స్ స్వీకరించు తేదీలు: 30-6-24 నుంచి 5-7-24 వరకు
- సమయం: ఉదయం 10 గం.ల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫీజు: రూ.3,000
- వర్క్‌షాప్ షెడ్యూల్ తేదీలు: 5-7-24 నుంచి 31-7-24 వరకు
- సమయం: ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు

రిజిస్ట్రేషన్స్, శిక్షణా స్థలం

విజయ బ్యూటీ కేర్, కొత్తపేట, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా

ఫోన్ నంబర్లు : 9394754478, 99126 71555

కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందిస్తారు

క్లుప్తంగా

రివర్స్ చేస్తుండగా లారీ ఢీకొని కూలీ మృతి


తాతారావు మృతదేహం

పెంటపాడు: రాచర్లలో వ్యవసాయ గిడ్డంగిలో అన్‌లోడు కోసం లారీ రివర్స్ చేస్తున్న క్రమంలో ఢీకొనడంతో ఓ జట్టు కూలీ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. వెంకట్రామన్నగూడెంకు చెందిన నలమాటి తాతారావు (43) జట్టు కూలీగా పని చేస్తున్నాడు. రాచర్ల – ప్రత్తిపాడు రోడ్డులోని శ్రీలక్ష్మి రూరల్ గోడౌన్‌లో శనివారం పనులకు వెళ్లాడు. అక్కడ ఒక లారీ నుంచి బస్తాలు దింపుతుండగా అదే సమయంలో మరో లారీ అన్‌లోడ్ చేసేందుకు రివర్స్ చేస్తున్న సమయంలో రెండు లారీల మధ్యలో నలిగి తాతారావు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పెంటపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. బంధువులు, జట్టు కార్మికుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లెదర్ తయారీలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూ టౌన్): లెదర్ సంబంధిత తయారీలో శిక్షణ కోసం మాదిగ కులానికి చెందిన (స్త్రీ/పురుషులు) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం ఇన్‌చార్జి కార్యనిర్వాహక సంచాలకులు బి.సోమశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూలై 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఏలూరు కలెక్టరేట్ కాంపౌండ్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సమర్పించాల్సిందిగా కోరారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, మాదిగ కుల ధ్రువీకరణ పత్రం, వయస్సు 21 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలని, ఆధార్ కార్డు, తెలుపు రేషన్ కార్డు ధ్రువీకరణ పత్రాలు జత చేయాలన్నారు. లెదర్ సంబంధిత తయారీ శిక్షణలో కోర్సునకు సంబంధించి 45 రోజులు శిక్షణ ఉంటుందని, విజయవాడలో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఎటువంటి స్టైఫెండ్ ఇవ్వరని, వసతి సదుపాయం కల్పిస్తారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు గడువు లోగా ఏలూరులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో నేరుగా గానీ, ఇ-మెయిల్ ద్వారా గాని దరఖాస్తులు సమర్పించవచ్చని సోమశేఖర్ తెలియజేశారు.

ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి

సండే స్పెషల్

'ఆహా.. ఏమి రుచి తినరా మైమరచి.. రోజూ తిన్నా మరీ మోజే తీరనిది' అంటూ ఓ సినీకవి వంకాయ కూర రుచిని వర్ణిస్తే.. వంకాయల్లో రారాజుగా ఖ్యాతిగాంచింది పెన్నాడ వంకాయ. నిగనిగలాడే రంగు, కూరగిన్నెలోంచి ఒక ముప్వంకాయ తీసి నోటిలో పెట్టుకోగానే వెన్నలా కరిగిపోయే మృదుత్వం, కమ్మనైన రుచి ఇక్కడ లభించే వంకాయలకు ఆ గుర్తింపును తెచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పక్కనే గల పెన్నాడ పరిసర గ్రామాల్లో ఈ రకం వంకాయను సాగు చేస్తుండటంతో ఇది పెన్నాడ వంకాయగా ప్రసిద్ధి చెందింది.

- భీమవరం స్పెషల్ పెన్నాడ వంకాయ
- వంకాయ రకాల్లో రారాజుగా ఖ్యాతి
- పెన్నాడ, వంకాయలపాలెం పరిసర గ్రామాల్లో 80 ఎకరాల్లో సాగు
- ఎకరాకు 14 టన్నుల వరకు దిగుబడి
- హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు ఎగుమతి
- వంగ నారుకు యమ డిమాండ్
- గోదావరి లంకలు, హైదరాబాద్ పరిసరాల్లోనూ పెంపకం
- వర్షాల రాకతో వంగ నాట్లలో నిమగ్నమైన రైతుల


ఆకర్షణీయంగా పెన్నాడ వంకాయలు


పెన్నాడపాలెంలో తోటలో వంకాయలు కోస్తున్న రైతు


కాయలతో వంగ చెట్టు

సాక్షి, భీమవరం: పాలకోడేరు మండలం పొన్నాడ, పక్కనే గల పొన్నాడపాలెం, వంకాయలపాలెం గ్రామాలు కూరగాయల సాగుకు ప్రసిద్ధి. ఇక్కడి ఇసుక, నల్లరేగడి నేలల్లోని మెరక పొలాలు, దిమ్మెలు, చెరువుగట్లు తదితర చోట్ల వందకు పైగా ఎకరాల్లో రైతులు వంకాయ, బీర, బెండ, ఆనబ, తోటకూర, గోంగూర తదితర కూరగాయలు, ఆకు కూరలను పండిస్తుంటారు. వీటిలో అధికంగా 80 ఎకరాల్లో వంకాయ సాగవుతుందని అంచనా. సాధారణంగా తెలుపు, నలుపు రంగుల్లో వంకాయలు ఉంటాయి. పూర్వం కోడిగుడ్డు పరిమాణంలో ఉండే తెలుపు రంగు వంకాయలను సాగు చేసేవారు. తర్వాత చిన్న సైజు నల్ల వంకాయలను సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని ఇసుక నేలలు, విత్తనం పెన్నాడ వంకాయకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని స్థానిక రైతులు చెబుతుంటారు. విత్తనాల కోసం మొదలులోని కాయలను సేకరించి వాటిని భద్రపరుస్తారు. ఏడాది పొడవునా సాగు జరిగినప్పటికీ అధికంగా వర్షాలకు ముందే వంగ తోటల సాగు చేపడతారు. తొలకరికి ముందు వంగనారును సిద్ధం చేసుకుని వర్షాలు మొదలుకాగానే భూమిని గుల్ల చేసి నారు నాటుతారు. రెండు నెలల వ్యవధిలో దిగుబడి మొదలవుతుంది. ఏడు నుంచి ఎనిమిది నెలల పాటు తోటను పెంచుతారు. వారానికి ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు చొప్పున సాగుకాలంలో 14 టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా. ఒకసారి వంగతోట తీశాక ఆ స్థలంలో వంగ వేయకుండా వేరే కూరగాయలు పండిస్తారు. వాటి కాపు ముగిసిన తర్వాత మరలా వంగ సాగుచేస్తూ పంట మార్పిడి అవలంబిస్తుంటారు. పుచ్చుపట్టిన, తెగులు సోకిన మొక్క కాయలు చేదు వస్తాయని మొక్కను తొలగిస్తూ సాగులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు.

జిల్లాలో జరిగే వేడుకల్లో పెన్నాడ వంకాయను ప్రత్యేక వంటకంగా వడ్డిస్తుంటారు. వెజ్, నాన్‌వెజ్ వంటకాల్లో వీటిని అధికంగా వినియోగిస్తారు. భోజన ప్రియులు వీటితో రకరకాల వంటకాలు చేస్తుంటారు. వీటి ప్రత్యేకత దృష్ట్యా బయటి వంకాయలతో పోలిస్తే ఇక్కడి వంకాయలు రెట్టింపు ధర పలుకుతాయి. స్థానికంగానే కాకుండా హైదరాబాద్‌కు వీటిని ఎగుమతి చేస్తుంటారు.

నారుకు డిమాండ్

ఇక్కడ పండే వంకాయలకే కాకుండా నారుకు ఇటీవలి కాలంలో డిమాండ్ బాగా పెరిగింది. వంకాయలకు ఉన్న గిరాకీ దృష్ట్యా ఉమ్మడి గోదావరి జిల్లాలోని గోదావరి లంకలతో పాటు హైదరాబాద్ శివార్లలోను పెన్నాడ నుంచి వంగనారు తీసుకువెళ్లి పెంచుతున్నారు. గతంలో స్థానిక వినియోగానికి నారు సిద్ధం చేయగా, ఇటీవల కాలంలో నారు ఎగుమతి ఊపందుకున్నట్టు రైతులు తెలిపారు. ఆర్డరుపై నారును సిద్ధం చేసి పంపుతున్నారు. బయటి ప్రాంతాల్లో వీటిని పండించి పెన్నాడ వంకాయలుగా మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నారు. ప్రస్తుతం తొలకరి వర్షాల నేపథ్యంలో వంగతోటలు సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

నారు ఎగుమతి చేస్తున్నాం



ఇటీవల కాలంలో పెన్నాడ నుంచి వంగ నారును ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి పెంచుతున్నారు. గోదావరి లంకలు, హైదరాబాద్ ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈక్రమంలో వంగనారు విక్రయాలు పెరిగాయి.

– యిర్రింకి ఫణీంద్ర, రైతు

నేలలో సారం వల్లే



ఈ ప్రాంతంలో సారవంతమైన ఇసుక నేలలు, విత్తనం వలన పెన్నాడ వంకాయకు ఆ ప్రత్యేకత వచ్చింది. దూర ప్రాంతాల నుంచి తోట వద్దకు వచ్చి వంకాయలు కొనుగోలు చేసుకుని తీసుకు వెళుతుంటారు.

– పి శ్రీనివాస్, రైతు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న నారు

ఉపాధ్యాయుడిపై విద్యార్థి బంధువుల దాడి

పెనుమంట్ర: నెగ్గిపూడి (మార్టేరు)లోని శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాలలో విద్యార్థి బంధువులు ఉపాధ్యాయుడిపై దాడి చేసి గాయపపర్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. నెగ్గిపూడికి చెందిన సత్తి దుర్గారెడ్డి ఈ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 26న పాఠశాలకు ఆలస్యంగా వచ్చాడని లెక్కల ఉపాధ్యాయుడు దూలం సత్యనారాయణ అతడిని మందలించి హెచ్‌ఎంకు అప్పగించారు. మధ్యాహ్నం ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విద్యార్థి విషయం చెప్పగా వారు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిని నిలదీస్తుండగా, విద్యార్థి మేనమామ, మరో వ్యక్తి కలిసి ఉపాధ్యాయునిపై దాడి చేసి గాయపర్చారు. ఈనెల 27న ఉపాధ్యాయుడు సత్యనారాయణ ఫిర్యాదు చేయగా, పెనుగొండ సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో పెనుమంట్ర ఇన్‌చార్జి ఎస్సై సుభాని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మీ సేవలు అభినందనీయం

- జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల
- రిటైరైన పోలీసు సిబ్బందికి ఘన సన్మానం



పదవీ విరమణ చేసిన పోలీస్ సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): పోలీసు శాఖలో దశాబ్దాల పాటు సేవలందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అన్నారు. ఈ నెలాఖరు నాటికి ఉద్యోగ విరమణ చేయనున్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఎస్పీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బంధాలకు, అనుబంధాలకు దూరమై, ఎన్నో బాధలు, బాధ్యతలు ఉన్నా అన్నిటిని మరచి ఉద్యోగాన్ని సవాల్‌గా తీసుకుని పోలీసు శాఖకు సేవలందించారని అభినందించారు. సిబ్బంది అందించిన సేవలకు పోలీసు శాఖ తప్పకుండా రుణపడి ఉంటుందని, పదవి విరమణ పొందిన తరువాత కుటుంబ సభ్యులతో కలిసి మిగిలిన జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఏఎస్పీ వి.భీమారావు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని, శేష జీవితాన్ని ఆనందంగా కుటుంబంతో గడపాలన్నారు. ప్రభుత్వం అందాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అన్నీ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రిటైరైనా పోలీసు శాఖ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. ఆదివారం పదవీ విరమణ చేయనున్న వారిలో ఎస్సై హెచ్.రెహమాన్, ఎస్‌బీ ఎస్సై ఎస్.హనుమంతరావు, భీమవరం రూరల్ ఏఎస్సై ఎ.శ్రీనివాసరావు, మొగల్తూరు హెచ్‌సీ టి.పాండురంగారావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిట్ పేరుతో అదనంగా వసూళ్లు

- డ్వాక్రా సంఘాల నుంచి రూ.50 అదనంగా వసూలు
- మునిసిపల్ కమిషనర్‌కు డ్వాక్రా మహిళల ఫిర్యాదు

నూజివీడు: పట్టణంలోని మెప్మా పరిధిలో ఉన్న స్వయం సహాయక సంఘాల నుంచి ఆడిట్ పేరుతో అదనంగా సొమ్ములు వసూలు చేస్తున్నారు. దీనిపై స్వయం సహాయక సంఘాలకు చెందిన పలువురు మహిళలు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. స్వయం సహాయక సంఘాల పనితీరుపై ప్రతి ఏటా ఆడిట్ నిర్వహించడం జరుగుతుంది. ఇలా ఆడిట్ చేసినందుకు గాను ఆడిట్ చేసే సంస్థకు ఒక్కో గ్రూపు రూ.250 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. దీనికి గాను ఆ సంస్థ రసీదును సైతం ఇస్తుంది. అయితే ఇక్కడే మెప్మా సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. ఆడిట్ పేరుతో ప్రతి గ్రూపు నుంచి రూ.300 వసూలు చేస్తున్నారు. ఎవరైనా గ్రూపు సభ్యులు రూ.50 ఎక్కువ ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే మాతో పనేమీ ఉండదా, మీ గ్రూపు సక్రమంగా పనిచేస్తుందా అంటూ వారిని మెప్మా సిబ్బంది బెదిరిస్తున్నట్లు స్వయం సహాయక సంఘాల మహిళలు వాపోతున్నారు. కార్యాలయంలో పనిచేసే ఒక ఆర్పీ ఈ మొత్తం వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కార్యాలయంలో ఏళ్ల తరబడి తిష్టవేసి అధికారి ఎవరొచ్చినా పెత్తనం చేస్తున్నట్లు సభ్యులు చెబుతున్నారు. గ్రూపుల తీర్మానం పుస్తకాలు, ఎస్ఎల్ఎఫ్ పుస్తకాలను సైతం అధిక ధరలకు గ్రూపుల సభ్యులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. పట్టణంలో 960 గ్రూపులుండగా ఒక్కొక్క గ్రూపు నుంచి రూ.50 చొప్పున వసూలు చేస్తే మొత్తం గ్రూపుల నుంచి రూ.48 వేలు వసూలవుతాయి. ఒక్కొక్క గ్రూపు నుంచి చిన్న మొత్తమైనా అన్ని గ్రూపుల నుంచి పెద్ద మొత్తంలో వసూలవుతోంది. దీనిపై కమిషనర్‌ను వివరణ అడగగా ఆడిట్ పేరుతో రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదు అందిందని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీవారి సేవలో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ


ఆలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాద్ దంపతులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్యక్షేత్రాన్ని శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన పద్మశ్రీ, ప్రసాద్ దంపతులకు ముందుగా ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి స్వామివారి శేష వస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు శ్రీవారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ పి.నటరాజారావు తదితరులున్నారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణం


అనివేటి మండపంలో భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్యక్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతివారం భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. అయితే ఈ వారం వర్షం కారణంగా భక్తుల రద్దీ బాగా తగ్గింది. దీంతో దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్, తూర్పు రాజగోపురప్రాంతం, అనివేటి మండపం, కల్యాణకట్ట తదితర విభాగాల వద్ద భక్తులు స్వల్పంగా కనిపించారు. ఆదివారం భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని ఆలయ వర్గాలు చెబుతున్నాయి.

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలి


జెడ్పీ డిప్యూటీ సీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో పని చేస్తున్న ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు జెడ్పీ డిప్యూటీ సీఈఓ శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నాలుగేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న బ్యాలెన్స్ షీట్లను త్వరితగతిని పూర్తి చేసి ఉపాధ్యాయులకు పంపించాలని కోరారు. పీఎఫ్ రుణాలు ఫైనల్ పేమెంట్‌కు దరఖాస్తు చేసిన వారికి అప్లికేషన్ స్టేటస్ తెలుసుకునే అవకాశం కల్పించాలని, కృష్ణా జిల్లా నుంచి ఏలూరు జిల్లాలో కలిసిన 8 మండలాల ఉపాధ్యాయుల పీఎఫ్ వారి అకౌంట్లో జమకావడం లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డిప్యూటీ సీఈఓ స్పందిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తఫా అలీ, రవికుమార్ రుద్రాక్షి, జిల్లా ఆడిట్ కన్వీనర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: యువకుడు అదృశ్యంపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. యమునాపల్లికి చెందిన బుంగా చందు ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 28న పని చేసి వస్తానని బయటకు వెళ్లి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా అతని జాడ తెలియలేదు. దీంతో తండ్రి బుంగా గంగాజలం ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపెట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో విజయవాడలో ఉన్న భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) ఆధ్వర్యంలో నిర్వహించే మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి సప్లిమెంటరీ పాసైన విద్యార్థులకు ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు సీపెట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పించిందన్నారు. విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ సదుపాయం ఉంటుందన్నారు. పరిమితమైన సీట్లు మాత్రమే కలవని, ఆసక్తి కలిగిన విద్యార్థులు జులై 7వ తేదీ ఆదివారం లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్లాస్టిక్ రంగంలో బహుళ జాతి సంస్థ (ఎంఎన్‌సీ) ఇతర అనుబంధ సంస్థలలో జూనియర్ ఇంజినీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్ అండ్ మేకర్, జూనియర్ ఇంజినీర్ (మెయింటెనెన్స్), క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ప్రారంభ వేతనం నెలకు రూ.16 వేల నుంచి రూ.20 వేలు వరకు ఉంటుందన్నారు. ఈ కోర్సులలో చేరాలనుకునే విద్యార్థులు పూర్తి వివరాల కోసం 93980 50255 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: ఆర్థిక వేధింపులు భరించలేక ఓ వ్యక్తి బలన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని హరిరామ జోగయ్య కాలనీకి చెందిన మామిడిశెట్టి ప్రసాద్ (42) భీమవరానికి చెందిన బి.శ్రీను, ఉండి గ్రామానికి చెందిన శివలతో కలిసి గతంలో అక్రమ మద్యం వ్యాపారం చేశాడు. అనంతరం వ్యాపార లావాదేవిల్లో భాగంగా ప్రసాద్‌తో ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకున్నారు. కొన్నాళ్ల తరువాత ప్రసాద్ శ్రీను, శివలతో వ్యాపార లావాదేవీలు మానేశాడు. అప్పటి నుంచి శ్రీను, శివలు ప్రసాద్ వద్ద తీసుకున్న చెక్కులతో తమకు నగదు ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేశారు. వీరి వేధింపులు భరించలేక ప్రసాద్ శనివారం వేకువజామున సూసైడ్ నోట్ రాసి, సెల్‌ఫోన్‌లో వీడియో తీసి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రసాద్ భార్య గతంలో మృతి చెందడంతో రెండో వివాహం చేసుకున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు. రెండో భార్య లీలాగౌరి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైబర్ నెట్ కేబుల్ చోరీ


విద్యుత్ స్తంభంపై వేలాడుతున్న కేబుల్ వైరు

లింగపాలెం: తోచలక రాయుడుపాలెంలో ఏపీ ఫైబర్ కేబుల్ వైరు చోరీకి గురైంది. పెదవేగి మండలం రాయుడుపాలెం గ్రామానికి చెందిన మేడిది రామచంద్రరావు అనే కేబుల్ ఆపరేటర్ తోచలక రాయుడుపాలెం గ్రామానికి సుమారు 16 సంవత్సరాల క్రితం వచ్చి తోచిలక, కొణిజర్ల గ్రామాల్లో ఏపీ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్ సేవలను అందిస్తున్నారు. గత రాత్రి గుర్తుతెలియని దుండగులు తోచలక నుంచి కొణిజర్ల వెళ్లే సుమారు 400 మీటర్ల కేబుల్ వైర్‌ను అపహరించారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత కేబుల్ ఆపరేటర్ రామచంద్రరావు తెలిపారు.

క్లుప్తంగా

అప్రమత్తత అవసరం



వార్డులో అవగాహన ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తతంగా ఉండాలని వైద్య సిబ్బంది పట్టణంలో శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. 1వ డివిజన్ 20వ వార్డులో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు వివరించారు. డెంగ్యూ వ్యాధితో పాటు ఇతర వ్యాధులు నివారించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్, సెక్రటరీలు, మేస్త్రీలు, ఆశా, ఎ.ఎన్.ఎంలు పాల్గొన్నారు.

రావిపాడులో నేడు భారీ అన్నసమారాధన

పెంటపాడు: రావిపాడు గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పరిసర గ్రామాల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం



అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యేను అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్నారులకు విద్యతో పాటు పౌష్టికాహారం, బాలింతల ఆరోగ్యం కోసం నిరంతరం పాటుపడుతున్న అంగన్‌వాడీలకు తగిన గుర్తింపు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఉండి: నింబధనలు అతిక్రమించే ప్రైవేటు స్కూల్స్‌పై కఠిన చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి బీ జ్యోతి హెచ్చరించారు.శనివారం మండలంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు, బ్యాగులు వంటి విద్యాసామాగ్రిని అమ్మకం చేస్తున్నారంటూ,ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కూడా అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు ఎంఈవో పాఠశాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో అక్రమంగా పుస్తకాలు కలిగి ఉన్నారని గుర్తించి వాటిని ప్రత్యేకమైన గదిలో పెట్టి సీల్ వేశారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం పట్టించుకోవట్లేదని దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులను పంపిస్తానని అన్నారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చి ప్రైవేటు స్కూల్స్ దోపిడీకి తెరతీసాయని అన్నారు. ఇప్పటికే ఉండి,భీమవరం తదితర ప్రాంతాల్లో వివిధ ప్రైవేటు స్కూల్స్‌పై ఫిర్యాదు చేశామని అన్నారు.ప్రైవేటు స్కూల్స్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని దీనిపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరుతున్నట్లు వారు తెలిపారు.

స్వామి వివేకానంద బోధనలు అనుసరణీయం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి నాగరాణి

కాళ్ల: స్వామి వివేకానంద బోధనలు అనుసరణీయమని, దైనందిన జీవితంలో ఆధ్యాత్మికత కూడా అవసరమని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. కాళ్ల మండలం పెద అమిరంలో ఉన్న వివేకానంద సేవా సమితి ద్వితీయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి. నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస బోధనలు ఎంతో ప్రశాంతతను ఇస్తాయన్నారు. వివేకానంద సేవా సమితితో నాకు సుమారు 25 సంవత్సరాలు అనుబంధం ఉందని అన్నారు. తొలుత వివేకానంద సేవా సమితి ఆవరణలో నూతనంగా నిర్మించిన నివేదిత భవనాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు వి.శివ వర్మ, కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, నందమూరి రాజేష్, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌గా ఉండాల్సిందే..



బస్సు డ్రైవింగ్ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్



బస్సులను పరిశీలిస్తున్న ఎంవీఐ సంజయ్‌కుమార్

- ముమ్మరంగా స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌లు జారీ
- పత్రాలు లేకుండా బస్సులు నడిపితే చర్యలు
- ఇంకా 20 బస్సులకు ఫిట్‌నెస్ తీసుకోవాలి

తణుకు: వేసవి సెలవుల అనంతరం జూన్ 13న స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాయి. జూనియర్ కళాశాలలు సైతం జూన్ 1న ప్రారంభమయ్యాయి. అయితే విద్యాసంస్థలకు చెందిన బస్సుల ఫిట్‌నెస్‌పై ఆయా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్‌పై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమయ్యారు. స్కూల్, కాలేజీ బస్సుల ఫిట్‌నెస్‌ల జారీపై దృష్టి సారించిన అధికారులు యాజమాన్యాలను హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఎఫ్‌సీ లేకుండా రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తామని రవాణా శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. బస్సులకు ఏవైనా మేజర్ రిపేర్లు ఉంటే వాటిని సరిచేసిన తర్వాతే రోడ్డు మీద తిప్పాలని, ఎలాంటి కాగితాలు లేకుండా బస్సులను నడిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. తణుకు రవాణా శాఖ యూనిట్ కార్యాలయం పరిధిలో 193 స్కూల్, కాలేజీ బస్సులు ఉండగా ఇంకా 20 బస్సుల వరకు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంది.

పాటించాల్సిన పద్ధతులివీ..

- ప్రతి స్కూల్ బస్సు ఫిట్‌నెస్‌కు సంబంధించి ఆర్సీ, ఇన్సూరెన్స్, టాక్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా బండిలో ఉంచుకోవాలి. ఇవి ఉంటేనే బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను రవాణా శాఖ అధికారులు జారీ చేస్తారు. అధికారుల తనిఖీల్లో వీటిని తప్పనిసరిగా చూపించుకోవాలి.
- స్కూల్ బస్సు డ్రైవర్‌కు ఐదేళ్ల డ్రైవింగ్‌లో అనుభవంతో పాటు 60 ఏళ్ల లోపు వయసు ఉండాలి. ఖాకీ యూనిఫారంతోనే బస్సును నడపాలి. కంటి సమస్యలు లేకుండా మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాలి.
- ప్రతి బస్సుకు అటెండర్‌ను తప్పనిసరిగా ఉంచాలి.
- బస్సు వేగం గంటలకు 55–60 కిలోమీటర్లు స్పీడ్ ఉండేలా స్పీడ్ గవర్నర్స్ తప్పనిసరిగా చూసుకోవాలి.
- బ్రేక్, హ్యాండ్ బ్రేక్, స్టీరింగ్, టైర్లు, స్పీడో మీటర్ అన్ని కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలి.
- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి. రిఫ్లెక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి.
- బస్సు నుంచి అధిక మోతాదుల్లో బ్లాక్ స్మోక్ రాకుండా చూసుకోవాలి.
- బస్సుకు అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరంతో పాటు ఫస్ట్ ఎయిడ్ బాక్సును ఉంచాలి.
- ఆయా స్కూల్ బస్సులపై డ్రైవర్ పేరు, ఫోన్ నంబర్ నమోదు చేయించాలి.
- పేరెంట్స్ కమిటీ ఆమోదించిన స్కూల్ బస్సులను మాత్రమే తిప్పనివ్వాలి.
- విద్యార్థులతో స్కూల్ బస్సు బయలు దేరినపుడు తప్పనిసరిగా డోర్ లాక్ చేయించాలి.
- స్కూల్ బస్సులను స్కూల్ ఆవరణలోనే ఉంచాలి. రోడ్డు సేఫ్టీ గురించి విద్యార్థులకు వారానికో రోజు అవగాహన కల్పించాలి.

కండిషన్‌లో లేకపోతే చర్యలు..

స్కూల్, కాలేజీ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఫిటన్‌నెస్ సర్టిఫికెట్ ఉంటేనే రోడ్డు మీదకు అనుమతిస్తాం. ఏమైనా మేజర్ రిపేర్లు ఉంటే అవి పూర్తి చేశాక మాత్రమే వాటికి ఫిట్ నెస్ సర్టిఫికెట్ ఇస్తాం. పొరపాటున ఏదైనా బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే ఆయా బస్సులపై, స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– సంజయ్‌కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, తణుకు

సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరావు

తణుకు టౌన్: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి, తగు జాగ్రత్తలతో మెలగాలని వైద్య ఆరోగ్య సిబ్బంది విద్యార్థులను కోరారు. శనివారం తణుకు రూరల్ మండలం పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ఆరోగ్య కార్యదర్శి ఝాన్సీరాణి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మూర్తి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ లక్ష్మీ, యేసు కృప, వార్డు సచివాలయ సిబ్బంది మణి, బాపూజీ, సుభాషిణి, శివ, సుశీల, శివశంకర్, వెంకట లక్ష్మీ, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

తణుకు అర్బన్: సీజనల్ వ్యాధుల పై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు ఏకేటీపీ హైస్కూల్‌లో శనివారం మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులంతా ముందుగా వ్యక్తిగత శుభ్రతకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. చేతుల శుభ్రత ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని, ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి దోమల వ్యాప్తిని నిరోధించడంతో సీజనల్‌గా వచ్చే మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధుల నుంచి బయటపడవచ్చన్నారు. చలి జ్వరం, నీళ్ల విరేచనాలు వంటి ఇబ్బందులు తలెత్తినప్పుడు సమీపంలోని వైద్యులకు చూపించుకోవాలని కోరారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. పాఠశాల హెచ్‌ఎం టి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ పి.మాధవి, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



నందమూరు గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కూలీల సంఖ్య కనుగుణంగా పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నందమూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ఆయకట్టుతో ముడిపెట్టి గ్రామానికి నాలుగు వేల పనిదినాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నట్టు కూలీలు వాపోయారు. ఉపాధి పనులు తప్ప వేరే పనులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేసేలా కొత్త ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోవాలని సోమరాజు కోరారు. ఈ కార్యక్రమంలో రొక్కం కనకమహాలక్ష్మి, కండెల్లి వెంకట్రావు, కంకిపాటి రవి, అమ్మాజీ, చిన్నం కుమారి, అడపా కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 170 కేసుల పరిష్కారం



తణుకు కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు



సమావేశంలో మాట్లాడుతున్న 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి

తణుకు అర్బన్: కక్షిదారులు తమ కేసుల విషయంలో రాజీ పడడమే రాజమార్గమని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తణుకు కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌లో 170 కేసులు పరిష్కరించామని, సివిల్ 33, చెక్కు బౌన్స్ 13, క్రిమినల్ 81, మోటారు యాక్సిడెంట్ 7, అడ్మిషన్స్ 15, బ్యాంక్ ప్రిలిటిగేషన్ 3, టెలిఫోన్ బకాయిలు 18 కేసులు రాజీ చేసినట్లు వివరించారు. ఈ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పాతర్లంక సాయిరామ్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏవీ నాగరాజు, స్పెషల్ కోర్టు జడ్జి చిరంజీవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కేసులు పరిష్కారం కోసమే జాతీయ లోక్ అదాలత్‌లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెండింగ్ కేసులు పరిష్కారం కోసమే జాతీయ లోక్ అదాలత్‌లు తరుచుగా మూడు నెలలకొకసారి నిర్వహిస్తున్నామని తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్ షేక్ సికిందర్ బాషా పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం పట్టణంలో కోర్టు భవనాలు సముదాయం ఆవరణలో 5 బెంచీలు ఏర్పాటు చేసి నిర్వహించారు. రాజీపడదగిన కేసులలో కక్షిదారులకు కేసులు నుంచి విముక్తి కలిగించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌లు ఎంతో ఉపయుక్తమని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. క్రిమినల్, సివిల్, మోటారు వాహన ప్రమాద భీమా కేసులు, బీఎస్ఎన్ఎల్, బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసులు రాజీ చేశారు. 184 పెండింగ్ కేసులు రాజీ అయ్యాయి. అదే విధంగా ప్రీ లిటిగేషన్ కేసులు 26 కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్ శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.అరుంధతి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి, పోలీస్ అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.విజయకుమార్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తణుకు టౌన్: బాలికలు ఉన్నత విద్యనభ్యసించడం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. శనివారం తణుకులోని ఎస్కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ సంస్థ డీఎస్టీ, ఎస్ఈఆర్‌బీ నిధులు రూ. 30 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన కెమిస్ట్రీ రీసెర్చ్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్బాయిలు చదువుకుంటే ఒక్కరికే ఉపయోగపడుతుందని, అదే అమ్మాయి చదువుకుంటే మొత్తం కుటుంబానికి ఉపయోగపడుతుందని చెప్పారు. అమ్మాయిలు డిగ్రీ చదువులతోనే ఆగిపోకుండా ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ప్రవాస భారతీయుడు, కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ కేవీ రావు మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో ప్రభుత్వ కళాశాలకు సరైన వసతులు లేవని, ప్రస్తుతం కళాశాలలో భవనాలు, సౌకర్యాలు బాగున్నాయన్నారు. ఈ సందర్భంగా కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థుల కోసం 100 కుర్చీలను డాక్టర్ కేవీరావు బహూకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చిలుకూరి రామకృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ, టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బీజేపీ నాయకురాలు ఐనంపూడి శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్, ఆర్ఎం భూపాల్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులలో దంత వైద్యంపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ భూపతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏరియా ఆస్పత్రిలో వెంకటరామన్నగూడెం, మాధవరం, పెంటపాడు, గణపవరం గ్రామాలకు చెందిన మెడికల్ ఆఫీసర్స్, వైద్య సిబ్బంది ఎంఒ, సీఎంఒ, ఎంఎల్‌హెచ్‌పీ, ఎ.ఎన్.ఎంలకు క్యాన్సర్ వ్యాధిపై శిక్షణ ఏరియా ఆస్పత్రి వైద్యులచే మూడు రోజుల పాటు నిర్వహించారు. సాధారణంగా వచ్చే నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌లు ఏ విధంగా వస్తాయి, ఎలా గుర్తించాలి, ఎలా పరీక్షలు చేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనలక్ష్మి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు సూపరింటెండెంట్ సూర్యనారాయణ, డాక్టర్ భూపతి, డాక్టర్ కె.రవికుమార్, డాక్టర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ,16 ప్రైవేటు ఐటీఐలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను రెండవ విడత ప్రవేశాల కోసం మొదటి విడతలో మిగిలిన సీట్లకు వచ్చే నెల 24లోపు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకుని విద్యార్థులు ఐటీఐ డాట్ జీవోవీ డాట్ ఇన్ అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకుని రసీదు పొందాలని సూచించారు. కౌన్సిలింగ్ సమయంలో రసీదు చూపించినవారే కౌన్సిలింగ్‌కు అర్హులని తెలిపారు. విద్యార్థులు జూలై 24 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవడంతో పాటు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కూడా పూర్తి చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు వెల్డర్ ఒక సంవత్సరం కోర్సు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాల కోసం విద్యార్థులు 08816 297093, 96760 99988కు ఫోన్ చేయాలని కోరారు.

కర్రీ...డోంట్ వర్రీ

- నగరంలో పెరిగిన కర్రీ పాయింట్లు
- జోరుగా అమ్మకాలు
- గ్రామాలకు విస్తరించిన కర్రీ పాయింట్‌లు





తణుకులో కర్రీ పాయింట్‌లు

తణుకు టౌన్: పట్టణ, గ్రామాల్లో కర్రీ పాయింట్లు శరవేగంగా విస్తరిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి చదువులు, వ్యాపారులు, ఉద్యోగాల కోసం అనేక మంది పట్టణానికి వస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. దానికి అనుగుణంగానే అనేక వ్యాపారాలు విస్తరిస్తున్నాయి. వాటిలో ముఖ్యంగా క్రరీ పాయింట్లు బాగా పెరిగాయి. అన్ని ప్రధాన కూడళ్లలో ఇవి విస్తరించాయి. పట్టణానికి వచ్చిన ఉద్యోగులు, విద్యార్థులతో పాటు చాలా మంది స్థానికులు కూడా అక్కడే కొనుగోలు చేస్తున్నారు. తణుకు పట్టణంలో చాలా చోట్లా అనేక కర్రీ పాయింట్లు ఏర్పాటు చేశారు. పట్టణానికి వచ్చే ఉద్యోగులు, చదువుకునే విద్యార్థులుతో పాటు ఇతర పనుల మీద ఆసుపత్రులకు వచ్చే రోగులకు వారి బంధువులకు కావాల్సిన అన్నం, కూరలు, సాంబారు, పెరుగు, పచ్చడి కర్రీ పాయింట్లలో లభిస్తున్నాయి. దీంతో ప్రజలు వాటి వద్ద క్యూ కడుతున్నారు. వీటితో పాటు చికెన్ కర్రీ, చేపల పులుసు, రొయ్యల వేపుడు ఇలా అన్ని రకాలు అందుబాటులో ఉంటున్నాయి.

నిమషాల వ్యవధిలోనే....

పట్టణ వాసుల్లో అత్యధిక శాతం భార్యభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తారు. దీంతో ఉదయమే ఉద్యోగాలకు, వ్యాపారాలకు వెళ్లిపోతారు. వారికి మధ్యాహ్నం భోజన సమయానికి ఆయా ప్రాంతాల్లోని కర్రీ పాయింట్లు ఆసరాగా నిలుస్తున్నాయి. వీటితో పాటు జోమెటో, స్విగ్గి, వంటి ఫుడ్ డెలివరీ యాప్‌లు ప్రజలకు అందుబాటులోకి రావడంతో కేవలం నిమిషాల వ్యవధిలోనే వారు కోరుకున్న ఆహారం ఇంటి ముందుకు వస్తోంది. కర్రీ పాయింట్‌ల్లో వివిధ రకాల కూరలు అందుబాటులో ఉండడంతో పాటు ధరలు తక్కువ ఉండటం. నాణ్యత కూడా బాగానే ఉండడంతో జనం ఆసక్తి చూపుతున్నారు.

ఉపాధికి ఊతం...

కర్రీ పాయింట్ వ్యాపారం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోంది. నరేంద్రసెంటర్, వెంకటేశ్వర థియేటర్ సెంటర్ తదితర జంక్షన్ వంటి ప్రాంతాల్లో కర్రీ పాయింట్లను మహిళలే నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో పోటీ పరీక్షలకు సంబంధించి పలు కోచింగ్ సెంటర్లు ఉండడంతో ఇక్కడ విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నారు. ఈ ప్రాంతాల్లో కర్రీ పాయింట్లు అధికంగా ఉండడంతో బియ్యం, కిరణా, కూరగాయలు, ఆకుకూరలు వంటి వ్యాపారాలు సైతం పుంజుకుంటున్నాయి. కర్రీ పాయింట్ల జోరుకు పట్టణంలోని పలు సెంటర్లలో ఉన్న హోటళ్ల యాజమానులు సైతం హోటల్‌తో పాటు ప్రత్యామ్నాయ కౌంటర్లు ఏర్పాటు చేయడం విశేషం.

వంటలపై ఉన్న మక్కువతో...



వంటలు చేయడంపై వున్న మక్కువతో కర్రీ పాయింట్ ఏర్పాటు చేశా. నాకు మరో ఇద్దరు సహాయంతో కూరలు తయారు చేసి అమ్ముతున్నాం. పెరిగిన కూరగాయల దరలతో ఇబ్బందిగా వున్న మరో వృత్తి చేయలేక, వంటలపై వున్న ఆశక్తితో కర్రీ పాయింట్ నిర్వహిస్తూ జీవనోపాది పొందుతున్నా...

–వై నిర్మల కుమారి, కర్రీపాయింట్ నిర్వాహకురాలు. తణుకు.

ప్రత్యేక కౌంటర్



గతంతో పోలిస్తే ఇప్పుడు హోటల్‌కు వచ్చే వినియోగదారులు సంఖ్య తగ్గింది. హోటల్‌కు వచ్చి తినే వారితో పోలిస్తే ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, టేకౌట్ డెలివరీ సంఖ్య పెరిగింది. వీటితో పాటు వివిధ రకాల వెజ్ అండ్ నాన్‌వెజ్ కర్రీలు, రైస్, బిర్యానీ వంటి అన్ని రకాల ఆహార పదార్థాలను విక్రయించేందుకు ప్రత్యమ్నాయ కౌంటర్‌ను ఏర్పాటు చేసి కొనుగోలుదారులకు అందిస్తున్నాం.

–గెద్దా శ్రీకాంత్, కర్రీ పాయింట్ నిర్వాహకులు, తణుకు.

పట్టణంలో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

తాడేపల్లిగూడెం : పట్టణ పరిధిలోని 9,389 మందికి జూలై 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ వెల్లడించారు. అధికారుల ఆదేశాలు మేరకు వృద్ధులు, వితంతువులు, గీత కార్మికులు, తదితరులకు గతంలో ఇచ్చే 3 వేలు పింఛన్‌ను ప్రభుత్వం 4 వేలకు పెంచినట్లు, గత మూడు నెలలకు సంబంధించి మరో 3 వేలు కలిపి రూ. 7 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని 35 సచివాలయాల పరిధిలో సంబంధిత సిబ్బంది ఇంటింటికి వచ్చి పింఛన్లు అందజేస్తారన్నారు.